క్లుప్తంగా

వేడుకగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండ: కార్తీకమాసం సందర్భంగా పెనుగొండలో ప్రసిద్ధి గాంచిన శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు ఆలయ అర్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేద పండితుడు రామడుగుల నరసింహమూర్తి, అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితులు మునుకుట్ల రామలింగేశ్వరరావు సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లురావు పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మొగల్తూరు: మండలంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. రామన్నపాలెం పంచాయతీ–2 రైతు సేవా కేంద్రం, మొగల్తూరులోని మూడో సచివాలయ పరిధిలోని రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందని, కల్లాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర వేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం గుమ్మలూరుకు చెందిన కొత్తకోట శ్రీను అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటింటి సర్వేలో ఏఎన్ఎంలను మినహాయించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ఏఎన్ఎంలు

పాలకొల్లు అర్బన్: పంచాయతీ, వార్డ్ హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పని చేస్తున్న ఉద్యోగులకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహించే వివిధ ఇంటింటి సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని సచివాలయ ఏఎన్ఎంల జిల్లా సంఘ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎంపీడీవో ఎస్ఎన్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఒకవైపు ఆరోగ్యశాఖ సర్వేలతో పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖ నిర్వహించే ఇంటింటి సర్వేలు వేయడం పని భారమవుతుందన్నారు. సచివాలయ ఏఎన్ఎంలు ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.సుధారాణి, జి.శిరీష, డి.సరళాప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం



ఇరుముడి కడుతున్న గురుస్వామి అడబాల శ్రీనివాస్

పెనుమంట్ర: మార్టేరు అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. అయ్యప్పస్వామి సేవా సమితి పీఠంలో మాలధారులు 41 రోజుల దీక్షను పూర్తి చేసుకున్న 30 మంది మాలధారులు ఇరుముడులు కట్టించుకుని శుక్రవారం శబరిమలై యాత్రకు బయలుదేరారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప నామ స్మరణతో స్వాములు బయలుదేరారు. తెల్లవారు జామున గురుస్వాములు అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకృష్ణారెడ్డి ముందుగా కన్నె స్వాములకు ఇరుముడులు కట్టిన అనంతరం సీనియర్ స్వాములకు ఇరుముడులు కట్టి శబరిమలై యాత్రకు పంపించారు. ఇంకా దీక్షా పీఠంలో 40 మంది వరకు మాలధారణ స్వాములు దీక్షలో ఉన్నారు.

ఎక్సైజ్ దాడులు

భీమవరం: మండలంలోని కొమరాడ గ్రామంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న పూరిళ్ల నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు శుక్రవారం చెప్పారు. నాగేశ్వరరావును 6 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సెల్: 94409 02439 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని బలరామరాజు తెలిపారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏం కొనలేం.. తినలేం !

- కూటమి సర్కారు బాదుడే.. బాదుడు
- పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజల బెంబేలు



కూరగాయల దుకాణం

యలమంచిలి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిత్యావసర సరుకుల ధరల పెంపుతో ప్రజలను బాదుతోంది. ఈ ప్రభుత్వంలో అన్ని వస్తువుల ధరలు పెరిగాయని ప్రజలు విమర్శిస్తున్నారు. కూరగాయలు, వంట నూనెలు, పప్పు దినుసులు ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సగటు సామాన్యుడు ఏం కొనేట్టు లేదు, ఏం తినేట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. చాలీచాలని జీతాలతో మధ్యతరగతి వారితోపాటు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కార్మిక, కర్షక ప్రజలు ఈ ధరల బాదుడికి బెంబేలెత్తిపోతున్నారు. సంపాదించే మొత్తం నిత్యావసర వస్తువులకే సరిపోతుంటే కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రోజువారీ సంపాదనపై ఆధారపడి జీవించే వారి పరిస్థితి దుర్భరంగా మారింది. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలను నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

కూరగాయల ధరలతో జేబు ఖాళీ

మార్కెట్లో కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి కనబడడం లేదు. ఉల్లిపాయల దగ్గర నుంచి అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.50కు పైబడి ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ వారం పాలకొల్లు సంతలో అమ్మిన ధరలను ఒకసారి పరిశీలిస్తే ఈ విధంగా ఉన్నాయి. చిక్కుడు రూ.80, క్యారెట్ రూ.60, మునక్కాయ రూ.10, ఉల్లిపాయలు రూ.60, టమోటా రూ.60, అల్లం రూ.60, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.60, బీట్‌రూట్ రూ.60 పలికాయి.

చుక్కల్లో వంట నూనె

ఒక్క కూరగాయలే కాదు కిరాణా సరుకుల ధరలు కూడా గడచిన నాలుగు నెలల కాలంలో 10 నుంచి 20 శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వంటనూనెల ధరలు అమాంతం పెరిగాయి. గతంతో పోల్చితే లీటరు ఆయిల్‌పై రూ.30 పెరిగింది. దిగుమతి సుంకం పెరగడంతో ఆయిల్ ధరలు పెరిగాయంటూ వ్యాపారులు చెబుతున్నారు. గతంలో రూ.120 ఉన్న ఆయిల్ ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.160 పలుకుతోంది. పప్పు ధరలకు రెక్కలు వచ్చాయి. మినపప్పు కేజీ రూ.150, కందిపప్పు రూ.190 పలుకుతుండడంతో సామాన్యులు కొనే పరిస్థితి కనబడడం లేదు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి



మండిపోతున్న నిత్యావసరాల ధరలు మాలాంటి మధ్య తరగతి ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వం మద్యం తక్కువ ధరలకు అమ్మడం వలన ప్రజలకు ఉపయోగం లేదు. నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అమ్మితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

–బాలం అంజిబాబు, రైతు, మేడపాడు

రూ.500 పెట్టినా సంచి నిండడం లేదు



మండిపోతున్న ధరలను చూస్తుంటే మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయమేస్తుంది. రూ.500 జేబులో వేసుకుని వెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదు. ఇంతగా పెరిగిపోతున్న ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు.

–పాకా సూర్యనారాయణ, పెనుమత్ర

ధాన్యం దిగుమతిలో జాప్యం చేస్తే కఠిన చర్యలు

రైసు మిల్లర్లకు ఆర్డీవో దాసి రాజు సూచన



భగ్గేశ్వరంలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో దాసి రాజు

పాలకొల్లు అర్బన్: మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తక్షణమే దిగమతి చేసుకుని రైతులకు రసీదులు ఇవ్వాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో దాసి రాజు చెప్పారు. మండలంలోని భగ్గేశ్వరంలో సూర్యతేజ రైస్‌మిల్లును శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు వచ్చాక జాప్యం చేయకుండా దిగుమతికి చర్యలు తీసుకోవాలని కస్టోడియన్ అధికారులకు, రైస్‌మిల్లు గుమస్తాలకు సూచించారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా మండలాల వారీగా అధికారులను నియమించి, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసే విధంగా సూచనలు చేశామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను రైతుసేవా కేంద్రాల నుంచి సంబంధిత అధికారుల ద్వారా పొందొచ్చన్నారు. అనంతరం మండలంలో శివదేవుని చిక్కాల రైతుసేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నరసాపురం: రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పటిష్టంగా నూరుశాతం పూర్తి చేయాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్డీవో నరసాపురం మండలం సీతారాంపురం నార్త్ రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్ తనిఖీ చేశారు. ధాన్యం తేమశాతం తెలిపే మిషన్‌ను తనిఖీ చేశారు. రైతుల నుంచి ప్రతి రోజూ ఎంత మేరకు ధాన్యం సేకరిస్తున్నారు, సేకరించిన ధాన్యానికి 48 గంటల్లో సొమ్ములు జమవుతున్నాయా? లేదా అని, పలు రకాల అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. సేకరించిన ధాన్యానికి సకాలంలో సొమ్ములు జమ కాకాపోతే వెంటనే అధికారులకు తెలియజేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. రైతులు ఇంకా ఎంతమంది కోతలు కోయాలి, ఇంకా రైతుల వద్ద ఎంత మేర ధాన్యం నిల్వలు ఉన్నాయి అనే విషయాలను కూడా ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

పెనుమంట్ర: వాతావరణంలో మార్పులు ఉన్నందున రైతులు తొందర పడి దళారుల చేతిలో మోసపోకుండా రైతుసేవా కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించుకోవాలని నర్సాపురం ఆర్డీవో దాసిరాజు అన్నారు. శుక్రవారం పాలమూరు గ్రామంలో రైతుసేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది అంతా కలిసి పనిచేసి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం చేయాలని ఆయన స్థానిక అధికారులకు సూచించారు. వాతావరణం అనుకూలంగా లేనందున ఇంకా ఎంతమంది రైతులు కోతలు కోయాలి, ఎంత మంది ధాన్యం కళ్లాల్లో ఉంది ఎప్పటికప్పుడు వివరాలు సేకరించాలన్నారు.

అపార్ నమోదు కేంద్రాల ఏర్పాటు



సీహెచ్ త్రిశూలపాణి, ఎంపీడీవో

మొగల్తూరు: ఆధార్ కార్డు తరహాలో అపార్ కార్డులో విద్యార్థుల వివరాలు నమోదు చేసుకునేందుకు మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి శుక్రవారం తెలిపారు. కేపీ పాలెం, పేరుపాలెం, పీపీ తోట, ముత్యాలపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో అపార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ చిన్నారులు కూడా తమ వివరాలు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేశామని, అంతేకాక ఆధార్‌కార్డుల్లో పేర్లు, అడ్రస్ మార్పులు, చేర్పులు చేసుకునేలా సిబ్బందిని నియమించామన్నారు. ప్రతీ విద్యార్థి వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

బాలికలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

పాలకొల్లు సెంట్రల్: బాలికలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని యునైటెడ్ కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డీఎన్నార్ కళాశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు స్త్రీలు సామాజిక పరంగా గృహ హింసలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు 1999 డిసెంబర్ 17న ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం నవంబర్ 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తుందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ కావలి మౌని, క్లబ్ సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ సిద్ధిరెడ్డి శైలజారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వరరావు

ఉండి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా ప్రాముఖ్యమని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దుకాణాలు, గృహ సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు జరిగే అవకాశం తగ్గుతుందన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఎలా ఉపయోగపడ్డాయో పలు సంఘటనలను ప్రజలకు తెలియపరిచారు. నేరాలు జరిగిన సమయంలో ఎంతో ఎక్కువ మొత్తాన్ని ప్రజలు గానీ వ్యాపారులు గానీ కోల్పోతున్నారని తెలిపారు. అదే సమయంలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉంటే నేరానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించడంతో పాటు పోగొట్టుకున్న సొమ్మును అత్యంత వేగంగా రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ పులగం శ్రీనివాస్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం



మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోయి ఖాళీగా ఉన్న రోడ్డు డివైడర్

నరసాపురం: పట్టణం సుందరీకరణ, అభివృద్ధి విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులు అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారయ్యింది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకుల నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌ఫాం నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్‌లో నాటిన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

23, 24 తేదీల్లో డీఎన్నార్‌లో ఈశా గ్రామోత్సవం

భీమవరం: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఈనెల 23,24 తేదీల్లో ఈశా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ భారత స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడానికి క్రీడలను మాధ్యమంగా ఎన్నుకున్నామని ఈ గ్రామోత్సవానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. దీనిలో భాగంగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ క్రీడలతోపాటు గ్రామీణ ఆటలు, సాంప్రదాయ కళలు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

ఉండి: భర్త వేధింపులను భరించలేని భార్య భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహదేవపట్నం శివారు రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన బొప్పన శ్రీనివాస్ లక్ష్మీదుర్గలకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన శ్రీనివాస్ ప్రతి రోజూ తాగి వచ్చి భార్య లక్ష్మీదుర్గను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇదే క్రమంలో ఈ నెల 19వ తేదీ మంగళవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో భార్యను చిత్ర హింసలకు గురి చేశాడు. దీంతో సహించలేని భార్య తన భర్తపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తూతూమంత్రంగా వైద్య శిబిరం



ములపర్రులో దిగువ స్థాయి సిబ్బందితో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పెనుగొండ: వైద్యులు లేకుండా వైద్య శిబిరాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. రెండు మూడు ఇళ్ల వద్ద డ్రైడే పర్యవేక్షణ ఇదీ ములపర్రులో వైద్య సిబ్బంది తీరు. ములపర్రులో జ్వరాల వ్యాప్తితో ప్రజలు హడలి పోతున్నారు. గత కొద్ది రోజులుగా జ్వరాల వ్యాప్తి అధికంగా ఉండడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వేలకు వేలు చెల్లించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా పెద గరువులో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. ఈ తరుణంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది వైద్యాధికారులకు సమాచారం అందించినా తూతూమంత్రంగా పర్యవేక్షణ చేసి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా డాక్టర్లు రాకుండా దిగువ స్థాయి సిబ్బందితో పని కానిచ్చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ములపర్రులో సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు చేయడం, దోమలు పెరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించి శిబిరాన్ని ముగించేశారు. దీంతో గ్రామస్థులు ఢీలా పడుతున్నారు. ఇప్పటికైనా వైద్యులు స్పందించి ములపర్రులో జ్వరాల వ్యాప్తిని తగించడానికి బాధితులకు వైద్యం అందించాలంటూ పలువురు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పెనుగొండ: ఉపాధి కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఉన్నతి కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా 3 నెలలు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, రూ.3000 అందిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని ధర్నా నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కాసాని విజయలక్ష్మీపెద్దిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతి కార్యక్రమం కొన్ని కుటుంబాలకే పరిమితం చేయకుండా ఉపాధి పని చేసే ప్రతీ కుటుంబానికి వర్తింప చేయాలన్నారు. ఏపీలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో కాసాని వరలక్ష్మి, మాదు మల్లేశ్వరి, కొండేటి సుబ్బలక్ష్మి, మిద్దే మంగమ్మ, కోమటి సత్యవతి, కోమటి సుబ్బారావు, మిద్దే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ట చర్యలు



పట్టణంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. అదేవిధంగా మౌలిక వసతులపై కూడా దృష్టి సారించామన్నారు. శుక్రవారం కమిషనర్ వివిధ వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వీధి దీపాలు, మంచినీటి సరఫరా తదితర అంశాల్లో ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనుల పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పారు. ప్రతి రోజూ డ్రెయిన్లను శుభ్ర పరిచేలా, మురుగు నిల్వ ఉండకుండా చూసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీవో

మొగల్తూరు: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని శేరేపాలెం గ్రామంలో ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ఎంత మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను ఆరా తీసి, మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లో లబ్ధిదారులకు ఖాతాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో మురుగు నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, కార్యదర్శి సేవాకిశోర్ పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



జడ్జి పి.విజయదుర్గ

నరసాపురం: స్థానిక కోర్టు ఆవరణలో డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ చెప్పారు. అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుదాయన్నారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. లోక్ అదాలత్‌ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా కృషి చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు.

పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

మొగల్తూరు: ప్రతి నెలా పింఛను తీసుకునే లబ్ధిదారులు ఇకపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీవో త్రిశూల పాణి తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు వరుసగా రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో బకాయి పింఛన్‌తో కలిపి మొత్తం చెల్లిస్తామని ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి తెలిపారు. డిసెంబర్ 1 నుంచి మొదలయ్యే పింఛన్ల పంపిణీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మృతి చెందితే లబ్ధిదారుడి భార్యకు మరుసటి నెలలోనే వితంతు పింఛన్ మంజూరు చేసేందుకు అవకాశం ఉందన్నారు.